సాక్షి
అనంతపురం

గురువారం । 27 । ఫిబ్రవరి । 2025



టన్ను చీనీ రూ.23,560

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,560 పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.6 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
38.2°/15.5°

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలితీవ్రత తగ్గగా.. ఎండలు పెరుగుతున్నాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

తాగునీటి సమస్యలపై నేడు కలెక్టర్ ఫోన్‌ఇన్



కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ గురువారం అనంత మిత్ర ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని ఆకాశవాణి కేంద్రంలో నిర్వహించనున్నారు. 08554 225533, 296890 నంబర్లకు ఫోన్ చేసి నేరుగా కలెక్టర్ దృష్టికి సమస్యలు తీసుకురావచ్చు.

శైవక్షేత్రాల వద్ద పటిష్ట బందోబస్తు



వజ్రకరూరు మండలం కొనకొండ్ల శివాలయం వద్ద పోలీసు బందోబస్తు

అనంతపురం: మహాశివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించినట్లు ఎస్పీ పి. జగదీష్ పేర్కొన్నారు. ప్రముఖ శివాలయాల వద్ద బ్యారికేడ్లను ఏర్పాటు చేయించి క్యూలైన్లు నిర్వహించారు. అనంతపురం త్రీ టౌన్, కూడేరు, కణేకల్లు పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న శివాలయాల వద్ద 'సైబర్ సురక్ష' కార్యక్రమంలో భాగంగా డిజిటల్ వాహనం ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

అండర్-14 ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: అండర్–14 ఫెన్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే జట్లను ఎంపిక చేశారు. నగరంలోని అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బుధవారం ఎంపిక ప్రక్రియ నిర్వహించినట్లు జిల్లా ప్రెసిడెంట్ మురళీకృష్ణ, సెక్రటరీ పుష్పావతి పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలు ఎన్టీఆర్ జిల్లాలో జరగనున్నాయి.

- బాలుర (ఫయిల్) విభాగంలో ఎస్.కార్తికేయ, కె.సాయి, కె.ఫణికుమార్, పీసీ దుర్గా విహాన్ యాదవ్.
- ఇప్పి విభాగంలో కేఎండీ రియాన్, సూరజ్, ఆహిల్, కరణం స్నేహిత్, సింహ, నూర్ అబ్దుల్లా.
- సబర్ విభాగంలో అమన్, కృష్ణదేవరాయ, సాద్విన్, అఖీబ్.
- బాలికల (ఫయిల్) విభాగంలో వందనా రెడ్డి, ముక్తాంబిక, సంజన బాయి.
- ఇప్పి విభాగంలో రక్ష, నయని చిన్మయి, శ్రావణి, పూజ్య రత్నం.
- సబర్ విభాగంలో ఆన్వి చౌదరి.

నేడు రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు

గుత్తి రూరల్: ఊబిచెర్లలో గుడిసె మల్లయ్య స్వామి ఉత్సవాల సందర్భంగా గురువారం రాష్ట్రస్థాయి దేశవు ఎద్దుల రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. మొదటి బహుమతి కింద రూ.20వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడు- రూ.10 వేల చొప్పున నగదు అందజేస్తారు. మరిన్ని వివరాలకు 97012 76208, 96525 34486 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శంభో శంకర



రాయదుర్గం: గవిసిద్దేశ్వరుడి ఆలయంలో 101 శివలింగాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

జిల్లావ్యాప్తంగా బుధవారం మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హర హర మహాదేవ శంభో శంకర నామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున శైవక్షేత్రాలకు తరలివెళ్లారు. భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఆచరిస్తూ స్వామిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. రాత్రంతా ఆలయాల్లో నిష్ఠతో జాగరణ చేశారు. పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి నెలకొంది. – సాక్షి బృందం



అనంతపురంలోని శివబాలయోగి ఆశ్రమంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం



అనంతపురం మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర, కోదండ రామాలయంలో భక్తుల సందడి

నాటు.. ఘాటు

- జిల్లాలో నాటుసారా ప్రభావిత గ్రామాలు 104పైగా ఉన్నట్టు వెల్లడి
- గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో ఎక్కువగా..
- ఇప్పటికే బెల్టుషాపులు, పర్మిట్ రూములతో విచ్చలవిడిగా మద్యం
- ఎక్సైజ్ పోలీసుల చోద్యంతో నాటు సారా కూడా అదేస్థాయిలో..

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లావ్యాప్తంగా ఇప్పటికే మద్యం షాపులు, బెల్టుషాపులు, పర్మిట్ రూములతో మద్యం ఏరులై పారుతోంది. విచ్చలవిడి మద్యంతో మత్తులో జోగుతున్న జిల్లాకు నాటుసారా ఘాటు కూడా తోడైంది. నాటుసారాకు బానిసలుగా మారిన వేలాది మంది ఆరోగ్యాలు గుల్లవుతున్నాయి. నాసిరకమైన పదార్థాలు వాడుతుండటంతో నాటుసారా అత్యంత వేగంగా కాలేయ సంబంధిత వ్యాధులకు గురి చేస్తున్నట్టు వైద్య నిపుణులు చెబుతున్నారు.

104 గ్రామాల్లో..

జిల్లాలో 104 గ్రామాల్లో నాటు సారా గుప్పుమంటున్నట్టు ఎక్సైజ్ పోలీసుల పరిశీలనలో వెల్లడైంది. గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, కంబదూరు, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో ప్రభావం ఎక్కువగా ఉన్నట్టు తేలింది. ఆయా ప్రాంతాల్లోని చాలా తండాల్లో గుట్టల్లో యథేచ్ఛగా సారా తయారు చేస్తున్నారు. 24 గ్రామాల్లో తయారీతో పాటు రవాణా కూడా చేస్తుండగా, మరో 44 గ్రామాల్లో తయారు చేసి అక్కడే తాగుతున్నారు. సుమారు 36 గ్రామాల వారు ఇతర ప్రాంతాల్లో తయారైన సారాను తెచ్చుకుని సేవిస్తున్నారు. ఈ గ్రామాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు. వీటి ఆధారంగానే చర్యలు తీసుకుంటారు.

వ్యాధులతో సతమతం..

జిల్లాలో తయారవుతున్న నాటుసారా అత్యంత నాసిరకమైనదిగా తేలింది. పాడుబడిన లిథియం బ్యాటరీ ముక్కలు, కొన్ని రకాల రబ్బరు చెప్పుల ముక్కలు, నాసిరకమైన నల్లబెల్లం తదితర పదార్థాలతో సారా కాస్తున్నారు. దీంతో కాలేయానికి తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని డాక్టర్లు చెబుతున్నారు. వాస్తవానికి సరైన పద్ధతిలో చేస్తే 17 రోజుల సమయం పడుతుంది. కానీ ఉదయం కాచి సాయంత్రానికే అమ్మేస్తున్నారు. ఇప్పటికే చాలామంది లివర్ సిరోసిస్, కిడ్నీ వ్యాధులతో సతమతవుతున్నట్టు తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా నియోజకవర్గ కేంద్రాల్లో ఎక్సైజ్ పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కళ్యాణదుర్గం మండల పరిధిలోని ఓ గ్రామం వద్ద నాటుసారాను ధ్వంసం చేస్తున్న పోలీసులు (ఫైల్)

జిల్లాలో నాటుసారా పరిస్థితి ఇలా

కేటగిరీ	గ్రామాల సంఖ్య
ఏ కేటగిరీ	24
బీ కేటగిరీ	44
సీ కేటగిరీ	36
మొత్తం	104
ప్రభావిత ప్రజలు	25,000 వరకు

తనిఖీలు కొనసాగిస్తున్నాం

నాటుసారా ప్రభావిత ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతూనే ఉన్నాయి. 'నవోదయం' కార్యక్రమంలో భాగంగా త్వరలోనే ఆయా గ్రామాల్లో సభలు నిర్వహించి అవగాహన కల్పిస్తాం. మాట వినకపోతే కఠినంగా వ్యవహరిస్తాం.

–రామమోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

యువకుణ్ని రక్షించిన పోలీసులు

రాప్తాడురూరల్: ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడిని అనంతపురం రూరల్ పోలీసులు రక్షించారు.వివరాల్లోకి వెళ్తే... కూడేరు మండలం జల్లిపల్లికి చెందిన రామాంజనేయులు అనే యువకుడు వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెంది చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు బుధవారం మధ్యాహ్నం అతని స్నేహితుడైన రాము సెల్‌కు వాట్సాప్ మెసేజ్ పెట్టాడు. దిక్కుతోచని పరిస్థితుల్లో రాము తనకు పరిచయమున్న ఆత్మకూరు ఎస్బీ హెడ్ కానిస్టేబుల్‌కు విషయం తెలిపాడు. ఆయన అనంతపురం ఎస్బీ హెడ్ కానిస్టేబుల్ శీనాకు చేరవేశాడు. ఈ క్రమంలో అనంతపురం రూరల్ సీఐ శేఖర్ దృష్టికి వెళ్లింది. వెంటనే బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు దేవేంద్ర, నాగేంద్రను అప్రమత్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సోములదొడ్డి సమీపంలో ఉన్న రామాంజనేయులు వద్దకు చేరుకున్నారు. అప్పటికే రామాంజనేయులు తన వెంట తీసుకెళ్లిన టూవీలర్ టైర్ ట్యూబ్‌కు తాను ధరించిన చొక్కాని కట్టి చెట్టుకు ఉరేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. గమనించిన కానిస్టేబుళ్లు వెంటనే ఆపి కాపాడారు. జల్లిపల్లిలో ఇటీవలే ఇల్లు కొనుగోలుకు చేసిన అప్పులు అధికం కావడం... వాటిని తీర్చే పరిస్థితి కనిపించకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు అతడు వాపోయాడు. స్టేషన్‌కు తీసుకొచ్చిన తర్వాత సీఐ కౌన్సెలింగ్ ఇచ్చి రామాంజనేయులును కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమస్యలకు చావు పరిష్కారం కాదని సీఐ సూచించారు.

'పోలవరం' ఎత్తు తగ్గింపే సంపద సృష్టా?

- జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా అంగీకరించలేదు
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



మాట్లాడుతున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, చిత్రంలో పార్టీ నేతలు

అనంతపురం ఎడ్యుకేషన్: సంపద సృష్టి అంటే పోలవరం ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించడమేనా అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్ట్‌ల పేరుతో కాలువల్లో నీళ్లు పారించాలనుకుంటున్నారా... లేదంటే జేబుల్లోకి నిధులు పారించాలనుకుంటున్నారా అని ప్రశ్నించారు. హంద్రీ-నీవా కాలువను రైతులకు ఉపయోగపడకుండా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. గతంలో చంద్రబాబు 5 టీఎంసీల తాగునీటి ప్రాజెక్ట్‌గా మార్చితే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తిరిగి 40 టీఎంసీలుగా మార్చారని గుర్తు చేశారు. పెరిగిన నీటి అవసరాలతో చివరి ఆయకట్టు ప్రాంతాలైన వైఎస్సార్, చిత్తూరు జిల్లాలకు నీళ్లు తీసుకెళ్లడం కష్టమని భావించి 2020లో అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక జీఓ తెచ్చారన్నారు. అప్పట్లోనే ఈ స్కీం పనులు చాలావరకు పూర్తయ్యాయన్నారు. రాయలసీమలో రైతులు చల్లగా ఉండాలనే మంచి ఆలోచనతో జగన్ అడుగులేశారన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 140 అడుగులకు తగ్గించాలని గతంలో కేంద్రం ఎన్ని ఒత్తిళ్లు చేసినా జగన్ ఒప్పుకోలేదన్నారు. చంద్రబాబు నేడు రాయలసీమకు తీరని అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు.

ఎవరిని మోసగించడానికి మరో స్కీం?

'చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పులివెందుల అవసరాల పోను పంపింగ్‌ను 15 రోజులు పెంచి రూ. 2,700 కోట్లతో కొత్త ప్రాజెక్ట్‌ను తీసుకొస్తామంటున్నారు. నిజంగా మిగులుగా ఉంటే గండికోట రిజర్వాయర్ నుంచి 16 కిలోమీటర్ల ప్రెజర్ టన్నెల్ ద్వారా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 2 వేల క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసే స్కీంను ఎందుకు తీసుకొస్తారు' అని ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. ఎవరిని మోసం చేయడానికి ఇలా చెబుతున్నారని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తవ్వాలన్నా కనీసం ఐదేళ్లు పడుతుందని,ఇప్పటికే చేపడుతున్న ప్రెజర్ టన్నెల్ పనులు పూర్తి కావాలన్నా 6-7 ఏళ్లు పడుతుందన్నారు. ఈలోగా హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పూర్తయితే ఉమ్మడి జిల్లాలో దాదాపు 2.50 లక్షల ఎకరాల పొలాలు బీళ్లుగా మారతాయని వాపోయారు.

రాజకీయాలకు కేశవ్ స్వస్తి పలకడం మేలు!

ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ తన నియోజకవర్గంలో ఉన్న పీఏబీఆర్ భూసేకరణకు డబ్బులివ్వాలని ప్రకాష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ పని చేయించలేకపోతే రాజకీయాలకు స్వస్తి పలకడం మేలని హితవు పలికారు. జగన్ హయాంలో చిత్రావతి ఆర్‌అండ్‌ఆర్‌కు సంపూర్ణంగా నిధులు ఇచ్చారని, గండికోటకు స్పెషల్ ప్యాకేజీ ఇచ్చారని గుర్తు చేశారు. సమావేశంలో అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, రాప్తాడు వైస్ ఎంపీపీ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ పేరూరు నాగిరెడ్డి, నాయకులు బండి పవన్, మీనుగ నాగరాజు, జూటూరు శేఖర్, నీరుగంటి నారాయణరెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వీసీ కోసం వేయి కళ్లతో..

- 9 నెలలుగా అంతులేని నిరీక్షణ
- 'కూటమి' వచ్చీ రాగానే కక్ష గట్టి రెగ్యులర్ వీసీలతో రాజీనామా
- ముందు చూపు లేకుండా సర్కారు తీసుకున్న నిర్ణయాలతో నేడు చిక్కులు
- ఉద్యోగుల భవిష్యత్తు దృష్ట్యా త్వరగా స్పందించాలని నిపుణుల సూచన



అనంతపురం: కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల వీసీలతో రాజీనామా చేయించారు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ వీసీ ఆధ్వర్యంలోనే శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పాలన సాగుతోంది. జేఎన్‌టీయూ (ఏ)కు గత వారం వీసీని నియామకం చేశారు. రాష్ట్రంలో మూడు వర్సిటీలకు వీసీలను నియామకం చేయాల్సి ఉంది. అందులో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఒకటి కావడం గమనార్హం.

మరింత జాప్యం తప్పదా..?

ఎస్కేయూ వీసీ నియామకానికి సంబంధించి సెర్చ్ కమిటీ సమావేశం నిర్వహించిన అనంతరం గవర్నర్‌కు ఒక పేరును సిఫార్సు చేశారు. అయితే సెర్చ్ కమిటీ ఎంపిక చేసిన వ్యక్తిని వీసీగా నియమించడానికి రాష్ట్ర ప్రభుత్వం సమ్మతించలేదు. దీంతో గవర్నర్ నుంచి ఫైలు ఉన్నత విద్యాశాఖకు వెనక్కి వచ్చింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉన్న సెర్చ్ కమిటీని కొనసాగించాలా? లేకుంటే అదే కమిటీతో మరోసారి అభ్యర్థుల పేర్లు సిఫార్సు చేయమని కోరాలా అనే అంశంపై ఉన్నత విద్యాశాఖ తర్జనభర్జన పడుతోంది. కొత్తగా మరో ముగ్గురి పేర్లు సిఫార్సు చేయమని కోరితే తక్కువ సమయంలోనే వీసీ ఎంపిక పూర్తి అవుతుంది. సెర్చ్ కమిటీ నామినీలు అంగీకరించకపోతే కమిటీని రద్దు చేసి, కొత్తది ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎస్కేయూ వీసీ ఎంపికలో మరింత జాప్యం అనివార్యం కానుంది.

సమస్యలతో సతమతం..

కూటమి సర్కారు ముందు చూపు లేకుండా తీసుకున్న నిర్ణయాలతో సమస్యలు వచ్చి పడ్డాయి. ఈ క్రమంలో నూతన వీసీ నియామకమైతే సమస్యలు పరిష్కారమవుతాయని ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నూతన వీసీ రాక కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. కొన్ని రోజులుగా వర్సిటీ బోధనేతర ఉద్యోగులు పదోన్నతులు ఇవ్వాలని పదేపదే విన్నవిస్తున్నా ఖాతరు చేయడం లేదని వాపోతున్నారు. జీతాలపై ప్రశ్నించే బోధనేతర ఉద్యోగులకు మెమోలు ఇవ్వడం, బెదిరించడం పరిపాటిగా మారింది. పెన్షనర్లు తమకు రెండు నెలల నుంచి పెన్షన్లు రావడం లేదని నేరుగా ఫిర్యాదు చేశారు. ఉద్యోగులకు రెండు నెలల నుంచి జీతాలు రాలేదు.మధ్యంతర బడ్జెట్ తీసుకురావడంలో విఫలం చెందడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొత్త వీసీ వస్తే ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

అధ్యాపకుల సంఘం ఎదురుచూపు..

ఎస్కేయూలో ప్రొఫెసర్లను కాదని, ఓ సాధారణ ఉద్యోగిని ఏకంగా రిజిస్ట్రార్‌గా నియామకం చేశారని గతంలో సీనియర్ ప్రొఫెసర్లు నేరుగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ రాసిన సంగతి విదితమే. ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రార్‌కు కనీసం డిప్యూటీ రిజిస్ట్రార్ స్థాయి కూడా లేదు. అయినా, ఏకంగా రిజిస్ట్రార్ పోస్టు కట్టబెట్టారు. పేరు ప్రఖ్యాతులు ఉన్న వర్సిటీకి.. రీసెర్చ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ స్థాయి ఉద్యోగిని రిజిస్ట్రార్‌గా నియమించడం వివాదాస్పదమైంది. ఇక.. ఇటీవల తన ఉద్యోగానికి సంబంధించిన ఇంక్రిమెంట్లు, అరియర్స్‌ను చక్కదిద్దే పనిలో రిజిస్ట్రార్ నిమగ్నమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఇప్పుడు కాకపోతే.. ఇంకెప్పుడు' అనే రీతిలో ఇంక్రిమెంట్లకు అనుమతి తెచ్చుకున్నారనే ఆరోపణలున్నాయి. ఆడిటింగ్ అభ్యంతరం తెలపడంతో ఈ వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. ఈ పరిస్థితుల్లో కొత్త వీసీ వస్తే ప్రొఫెసర్లకు రిజిస్ట్రార్ పోస్టు కేటాయించాలని వినతి పత్రం ఇస్తామని అధ్యాపకుల సంఘం ప్రతినిధులు బాహాటంగానే పేర్కొంటున్నారు.

సమాచారం ఇవ్వకుండానే విధ్వంసం!

తాడిపత్రిటౌన్: ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదు. నేరుగా ఇళ్ల వద్దకు జేసీబీలు పంపారు. మెట్లు, తాగునీటి పైపులు, చివరికి మరుగుదొడ్లను సైతం ధ్వంసం చేశారు. ప్రజలను అవస్థల్లోకి నెట్టారు. వివరాలు.. తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె గ్రామంపై టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి కక్ష కట్టారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ బలంగా ఉండటంతో కుతంత్రాలకు తెరలేపారు. గ్రామంలో రోడ్ల వెడల్పు, అభివృద్ధి పనులు అంటూ ధ్వంస రచన చేశారు. మురుగు కాలువ పేరుతో ఇంట్లోకి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా మెట్లు పగులగొట్టించారు. బాత్‌రూంల గోడలు ధ్వంసం చేయడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి పైపులను ధ్వంసం చేసి పండుగ పూట ప్రజలను ఇక్కట్ల పాలు చేశారు.

అధికారుల అత్యుత్సాహం..

గత 9 నెలల నుంచి గ్రామంలో వీధి లైట్లు,



తాగునీటి పైప్‌లైన్‌ను ధ్వంసం చేయడంతో ఓ కుటుంబం అవస్థలు

మురుగునీరు, తాగునీటి సమస్యలు నెలకొన్నాయి. ఆయా విషయాలపై సర్పంచ్ నీరజ విన్నవించినా పట్టించుకోని అధికారులు.. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించడమే తడవుగా జేసీబీలతో విధ్వంసం సృష్టించడం గమనార్హం. కనీసం సర్పంచ్‌కు ఈ విషయం తెలియజేయకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వీరి అరాచకంతో చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. భయభ్రాంతులకు గురైన కొన్ని కుటుంబాలు ఇళ్లు వదిలి వెళ్లిపోయాయి. గ్రామంలో అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని, సమాచారం లేకుండా ఇళ్లను గుల్ల చేస్తే ఎలా బతకాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కక్ష సాధింపు తగదు

అభివృద్ధికి మేం వ్యతిరేకం కాదు. ముందస్తు సమాచారం లేకుండా విధ్వంసం సృష్టించడం దుర్మార్గం. తాగునీటి పైపులు పగులగొట్టడంతో పండుగ పూట గ్రామస్తులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సజ్జలదిన్నె గ్రామ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. అభివృద్ధి పేరుతో కక్ష సాధింపు చర్యలకు దిగడం తగదు.

– నీరజ, సర్పంచ్, సజ్జలదిన్నె.



ఇంట్లోకి వెళ్లేందుకు సైతం వీలు లేకుండా తీసిన గొయ్యి

క్లుప్తంగా

43 అంజూర చెట్ల నరికివేత



తాడిపత్రి రూరల్: చుక్కలూరు సమీపంలో బుధవారం తెల్లవారుజామున రైతు శ్రీనివాసులుకు చెందిన 43 అంజూర చెట్లు నరికివేతకు గురయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు బాధితుడు తెలిపాడు. అయితే ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

సోలార్ ప్లాంట్‌లో చోరీ



ప్యానెళ్లు, వైర్లు చోరీ చేసిన దృశ్యం

గుత్తి రూరల్: ఎంగిలిబండ గ్రామ శివారులో ఉన్న సోలార్ ప్లాంట్‌లో ప్యానళ్లు, కేబుల్ చోరీ జరిగింది. ప్లాంట్ యజమాని శశికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోలార్ ప్లాంట్‌లోకి మంగళవారం అర్ధరాత్రి దుండగులు ప్రవేశించి ప్యానెళ్లు, స్టార్టర్ బాక్సులు, కేబుల్ ఎత్తుకుపోయారు. బుధవారం ఉదయం ప్లాంట్‌కు వచ్చిన కార్మికులు గమనించి వెంటనే యజమానికి సమచారం ఇచ్చారు. గతంలో కూడా ఇదే సోలార్ ప్లాంట్‌లో చోరీలు జరిగాయని యజమాని తెలిపాడు. ప్రస్తుతం చోరీ అయిన సొమ్ము విలువ రూ.2 లక్షలు ఉంటుందని వాపోయాడు. ఇక్కడ చోరీ చేసిన పరికరాలు పెద్దవడుగూరు మండలం తెలికి గ్రామంలోని గుజిరీల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నందకిషోర్‌కు 'ఉమ్మడిశెట్టి' పురస్కారం



నందకిషోర్

అనంతపురం కల్చరల్: ఉమ్మడిశెట్టి సతీష్‌కుమార్ జాతీయ యువపురస్కారాన్ని ఈ ఏడాది యువకవి నందకిషోర్‌కు అందిస్తున్నట్లు పురస్కార ప్రదాత డాక్టర్ రాధేయ తెలిపారు. తెలంగాణకు చెందిన నందకిషోర్ ఓ స్వచ్ఛంద సంస్థలో ప్రాజెక్టు లీడర్‌గా పనిచేస్తూ 'నాలాగా ఒకడుండేవాడు', 'యథేచ్ఛ', 'పరాధీన', 'అదే నది' వంటి కవితా సంపుటాలు వెలువరించారు. ప్రగతిశీల దృక్పథంతో సమాజాన్ని ప్రభావితం చేస్తున్న యువకవి నందకిషోర్‌కు 'ఉమ్మడిశెట్టి' అవార్డునందించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు.

తల్లీకుమారుడి అదృశ్యం

కదిరి టౌన్: పట్టణంలో నివాసముండే వివాహిత తన కుమారుడుడితో కలిసి బుధవారం అదృశ్యమైంది. ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసులు బుధవారం విలేకరులకు తెలిపారు. కదిరికి చెందిన మహిళకు కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన వ్యక్తితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు సంతానం. భర్తతో మనస్పర్థల కారణంగా కుమారుడిని తీసుకుని కదిరిలోని పుట్టింటికి వచ్చి ఉంటోంది. మంగళవారం సాయంత్రం కుమారుడిని స్కూలు నుంచి తీసుకొచ్చేందుకు వెళ్లిన వివాహిత తిరిగి రాలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దర్జీ బతుకుల్లో దర్జా మాయం

సందర్భం: రేపు ప్రపంచ టైలర్ల దినోత్సవం



- రెడీమేడ్ వస్త్రాల ఎఫెక్ట్.. • వస్త్రాలు కుట్టించుకునేవారు కరువు • టైలర్ షాపుల నిర్వహణా కష్టమే
- వృత్తిని వీడలేరు.. మరో రంగంలోకి పోలేరు • సంక్షోభంలో కూరుకుపోతున్న దర్జీల బతుకులు

రాయదుర్గంటౌన్: దుస్తులు మనిషికి అందం, హుందాతనం, విలువ, ఆకర్షణ కలిగిస్తాయి. వస్త్రానికి ఆకృతినిచ్చి కళాత్మకంగా తీర్చిదిద్దే నైపుణ్యం దర్జీల సొంతం. రెడీమేడ్ వస్త్రాలను కూడా దర్జీలే కుట్టినా ఇష్టమైన రంగు, ఇష్టమైన వస్త్రంతో సరిపోయే కొలతలతో కుట్టించుకునే వస్త్రాలను వేసుకుంటే మంచి అనుభూతి కలుగుతుంది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లోకి వస్తున్న కొత్త కొత్త ఫ్యాషన్లకు అనుగుణంగా బట్టలు కుట్టే నేర్పు ఉన్నా.. రెడీమేడ్ దుస్తుల వల్ల టైలర్లకు ఆదరణ పూర్తిగా తగ్గుతూ వస్తోంది. పండుగలు, శుభకార్యాల సమయంలో వారికి చేతినిండా పని ఉండేది. కొత్త దుస్తులు కుట్టించుకునేందుకు టైలర్ల వద్దకు క్యూ కట్టేవారు.



టైలర్ షాపులో పనిచేస్తున్న ఓ సీనియర్ కార్మికుడు

టైలర్ వృత్తి రోజురోజుకీ అనేక మార్పులకు గురవుతూ వచ్చింది. ఇప్పుడు ఫ్యాషన్ టెక్నాలజీలో భాగంగా మారింది. పాత కుట్టుమిషన్ల స్థానంలో అత్యాధునిక మిషన్లు వచ్చి చేరాయి. కంప్యూటర్ల ప్రవేశంతో ఎలాంటి డిజైన్ అయినా అలవోకగా తీర్చిదిద్దే విజ్ఞానం అందుబాటులోకి వచ్చేసింది. అయితే రెడీమేడ్ వస్తువుల రాకతో టైలర్ వృత్తి సంక్షోభంలో కూరుకుపోతోంది. ఫ్యాషన్ డిజైన్ మోజులో పడి టైలర్‌తో కుట్టించుకునే వారు గణనీయంగా తగ్గిపోయారు. శుక్రవారం ప్రపంచ టైలర్స్ డే సందర్భంగా దర్జీలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

టైలర్ షాపులు వెలవెల

గ్రామ స్థాయి నుంచి నగరం వరకు ప్రతి చోటా టైలర్లు ఉన్నారు. షాపుల ద్వారా కొందరు.. ఇళ్లల్లోనే మరికొందరు వస్త్రాలు కుడుతుంటారు. జిల్లాలో దాదాపు 8వేల మంది దర్జీ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. రెడీమేడ్ దుస్తులు తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చేస్తుండడంతో వస్త్రం తీసుకుని, టైలర్ల వద్ద కొలతలు ఇచ్చి కుట్టించుకునే వారు తగ్గిపోయారు. దుస్తులు కుట్టించుకునేందుకు ఎవరు వస్తారా అని టైలర్లు ఎదురుచూసే పరిస్థితులు వచ్చాయి. వినియోగదారులే లేక షాపులు వెలవెలబోతున్నాయి. సొంత షాపులు ఉన్న వారు ఎలాగోలా నెట్టుకొస్తుండగా.. మిగిలిన వారు కుటుంబ పోషణతో పాటు అద్దెలు చెల్లించేంత సంపాదలేక బతుకీడుస్తున్నారు.

నాడు 'చేదోడు'తో బాసట

కష్టాల్లో నలిగిపోతున్న టైలర్లను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుంది. టైలర్ల కోసం 'జగనన్న చేదోడు' పథకంతో ఆర్థిక భరోసా కల్పించింది. ప్రతి టైలర్‌కూ ఏడాదికి రూ.10 వేల చొప్పున ఆర్థికసాయం అందజేసి అండగా నిలిచింది. జిల్లాలో 4,045 మంది టైలర్లు నాలుగేళ్లపాటు లబ్ధి పొందారు. ఈ పథకం కొద్దిమేర టైలర్ల జీవనోపాధికి వెసులుబాటు కల్పించింది. అంతేకాక ప్రతి విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫాం క్లాత్‌ను ప్రభుత్వం అందించి, కుట్టు కూలి సొమ్మును తల్లుల ఖాతాల్లో జమ చేస్తూ వచ్చేది. యూనిఫాం ఇవ్వకుండా క్లాత్‌మాత్రమే ఇవ్వడంతో టైలర్లకు చాలా వరకు పని లభించింది. ఒక రకంగా టైలర్లకు పని లభించేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తమ సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని దర్జీలు వాపోతున్నారు.

సీజన్‌లోనూ పనులు లేవు



నేను 25 ఏళ్లుగా టైలర్ వృత్తిలో ఉన్నాను. రెడీమేడ్ దుస్తుల రాకతో.. దుస్తులు కుట్టించుకుని ధరించే వారి సంఖ్య పూర్తిగా తగ్గింది. పండుగలు, పెళ్లిళ్ల సీజన్‌లో కాస్త పని దక్కేది. ప్రస్తుతం అలాంటి సీజన్‌లో కూడా పనులు లేవు. ఇతర వృత్తి చేసుకోలేక.. టైలర్ పనితోనే నెట్టుకొస్తున్నాం. రోజుకూలి గిట్టుబాటైతే చాలు అన్నట్టు టైలర్ల పరిస్థితి ఉంది. ప్రభుత్వం మాలాంటి టైలర్లను ఆదుకోవాలి. ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయాలి. అవసరమైన పని కల్పించాలి.

– ఇస్మాయిల్, అఫిషియల్ జెంట్స్ టైలర్, రాయదుర్గం

టైలర్లకు పథకాలు అమలు చేయాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 'చేదోడు' పథకంతో ఏడాదికి రూ.10 వేలు లబ్ధి పొందాం. పొట్ట నింపని టైలర్ వృత్తిలో ఉన్న వారికి అప్పట్లో ఈ సాయం ఎంతో ఊటరనిచ్చింది. టైలర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలి. సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు కంప్యూటర్ టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు చేపడితే మహిళలకు ఉపయోగకరంగా ఉంటుంది.

– గౌరమ్మ, 32వ వార్డు, రాయదుర్గం

అద్భుతం.. బాలభైరవుడి రూపం



రామగిరి: పేరూరుడ్యాం గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే (ఏపీఆర్ఎస్) బాలుర పాఠశాల ఆర్ట్ టీచర్ శ్రీరాములు బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని వాటర్ కలర్లు (నీటిరంగులతో) బాల భైరవుడి చిత్రం గీశారు. ఈ చిత్రాన్ని ప్రత్యేక ప్రదర్శనలో ఉంచారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఈ చిత్రం చూసి అద్భుతంగా ఉందని ప్రశంసించారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్



దొంగలను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం: నగరంలో ద్విచక్రవాహనాలు దొంగిలిస్తున్న ఇద్దరిని నాలుగో పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ కె.సాయినాథ్ మీడియాకు వెల్లడించారు. ఇటీవల బళ్లారి బైపాస్ రోడ్డు వద్ద ఒక హోండా షైన్, మారుతినగర్ మొదటి క్రాస్‌లో మరొక హీరో స్ప్లెండర్ బైక్ చోరీ అయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు చోరీలకు పాల్పడుతున్నది పాత నేరస్తులైన ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన చాకలి మధు, పెనుకొండకు చెందిన మంగలి నరసింహులుగా గుర్తించారు. వీరిని బుధవారం అరెస్టు చేసి, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్టులో చొరవ చూపిన ఏఎస్ఐ ఎం.రమేష్, పోలీస్ కానిస్టేబుళ్లు ప్రణేష్, మహేష్‌లను అభినందిస్తూ ప్రోత్సాహక రివార్డుల కోసం ప్రతిపాదనలు పంపినట్లు సీఐ తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో చిన్నారి మృతి



మృతి చెందిన అనురాగ్ తేజ్

గుంతకల్లుటౌన్: ప్రైవేట్ ఆస్పత్రిలో ఓ చిన్నారి మృతి చెందాడు. డాక్టర్, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు చనిపోయాడని తల్లిదండ్రులు ఆరోపించారు. అయ్యవారిపల్లికి చెందిన రైల్వే ఉద్యోగి శామ్యూల్, కిరణ్మయి దంపతుల ఒక్కగానొక్క కుమారుడైన అనురాగ్ తేజ్ (8నెలలు) ఆయాసంతో బాధపడుతుండటంతో సోమవారం రాత్రి గుంతకల్లులోని సాయికృష్ణ నర్సింగ్ హోంలో చేర్పించారు. ఊపిరితిత్తుల్లో నెమ్ము కారణంగా ఇబ్బంది పడుతున్నట్లు వైద్యులు గుర్తించి చికిత్స మొదలు పెట్టారు. బుధవారం ఉదయం చిన్నారి శ్వాస తీసుకోవడానికి చాలా ఇబ్బంది పడ్డాడు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకెళ్లాల్సిందిగా డాక్టర్ సూచించారు. అంబులెన్స్‌లో తరలించడానికి సిద్ధమవుతున్న సమయంలోనే అనురాగ్‌తేజ్ ప్రాణం విడిచాడు. డాక్టర్, సిబ్బంది సకాలంలో సరైన వైద్యం అందించని కారణంగానే కుమారుడు చనిపోయాడని తల్లిదండ్రులు ఆరోపిస్తూ వాగ్వాదానికి దిగారు. వైద్య సేవల్లో ఎటువంటి నిర్లక్ష్యమూ జరగలేదని, అవసరమైతే సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించుకోవచ్చని డాక్టర్ పవన్ సమాధానమిచ్చారు. పట్టణంలోని సీనియర్ వైద్యులు, పుర ప్రముఖులు జోక్యం చేసుకుని బాలుడి కుటుంబ సభ్యులతో చర్చించి వివాదాన్ని సద్దుమణిగించారు.

జరుట్ల రామలింగేశ్వర బ్రహ్మోత్సవాలు ప్రారంభం





స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, ప్రత్యేక అలంకరణలో జరుట్ల రామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు

వజ్రకరూరు: జరుట్లరాంపురంలో జరుట్ల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో స్వామివారికి విశేష పూజలతో పాటు గణపతిపూజ, నవగ్రహ పూజ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చనలు, ప్రత్యేక అభిషేకాలు, కలశ స్థాపన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గ్రామానికి చెందిన వడియంపేట శివారెడ్డి దేవతామూర్తులకు నూతన వస్త్రాలు, రథానికి ప్రత్యేక అలంకరణ, భక్తులకు ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లా హొళగొంద మండలం సులువాయి గ్రామానికి చెందిన రాఘవేంద్ర చౌదరి అనే వ్యక్తి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య, సర్పంచ్ తిరుపాల్‌యాదవ్, గుమస్తా లాలేష్, ప్రధాన అర్చకుడు నాగరాజుస్వామి, గ్రామపెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం

జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో గురువారం సాయంత్రం జరుట్ల రామలింగేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య వెల్లడించారు. ఇప్పటికే రథాన్ని ప్రత్యేకంగా అలంకరించారన్నారు. గురువారం ఉదయం స్వామి వారికి అభిషేకం, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్య క్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 28న వసంతోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రాతిదూలం పోటీల విజేత తెలంగాణ వృషభాలు



రాతి దూలం లాగుతున్న ఎద్దులు

పామిడి: వంకరాజుకాలువ గ్రామ సమీపాన పెన్నప్పగుడి వద్ద గ్రామస్తులు ఆధ్వర్యంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న ఎర్రితాత, పక్కీరప్ప స్వాముల 24వ వార్షికోత్సవ వేడుకలు బుధవారంతో ముగిశాయి. వేడుకల్లో భాగంగా ఆరు పళ్ల విభాగంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతి దూలం లాగుడు పోటీల్లో తెలంగాణ వృషభాలు విజేతలుగా నిలిచాయి. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఏపీలోని ఉమ్మడి అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలకు చెందిన 15 జతల గాన్ల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీ హోరాహోరీగా సాగింది. మహబూబ్‌నగర్ జిల్లా వృషభరాజులు ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండో స్థానాన్ని అనంతపురం జిల్లా వృషభాలు దక్కించుకున్నాయి. 1 నుంచి 10వ స్థానం వరకు నిలిచిన వృషభాల విజేతలకు వరుసగా రూ. 40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.8 వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4 వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

మాజీ సైనికుడికి గాయాలు

గార్లదిన్నె: ఎగువపల్లి సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ సైనికుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి అనే మాజీ సైనికుడు కల్లూరు నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరాడు. ఎగువపల్లి వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మాజీ సైనికుడు తీవ్రంగా గాయపడ్డాడు.

ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఇంట్లో మంటలు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని శ్రీజనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వేంకటేశ్వరరెడ్డి ఇంట్లో మంటలు వ్యాపించాయి. విశాలమైన ఈ ఇల్లు చాలా పాతది. ముందు భాగంలో కారుతోందని మరమ్మతుల కోసం బుధవారం సాయంత్రం మిద్దెపై కొంత మట్టిని తొలగించారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఉన్నఫళంగా ఇంట్లోంచి మంటలు వ్యాపించాయి. టేకు వస్తువులతో పాటు చెక్క, దూలాలు, తీర్లు, మరికొన్ని వస్తువులు కాలిపోయాయి. మంటలు విస్తరిస్తుండడంతో కుటుంబ సభ్యులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమందించారు. గుంతకల్లుకు చెందిన ఫైర్ ఇంజిన్ అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసింది. అగ్ని ప్రమాదంతో రెండు లక్షల మేర నష్టం వాటిల్లిందని వేంకటేశ్వరరెడ్డి తెలిపారు.





అగ్ని ప్రమాద దృశ్యాలు

తిమ్మమ్మ మర్రిమానుకు పోటెత్తిన భక్తులు



తిమ్మమాంబ ఉత్సవాల్లో దుకాణాల వద్ద భక్తుల సందడి (ఇన్‌సెట్) అమ్మవారు

ఎన్పీకుంట: శివరాత్రి జాగరణ మహోత్సవాల్లో రెండో రోజైన బుధవారం తిమ్మమ్మ మర్రిమాను ప్రాంతం భక్తులతో పెట్టింది. ఉదయం చుట్టు పక్కల గ్రామాల మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలు ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. కమిటీ సభ్యులు అమ్మవారికి గంధాభిషేకం చేసిన అనంతరం వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. మర్రిమాను ప్రాంతంలో చూడదగ్గ ప్రదేశాలైన తిమ్మమ్మకోట, శివప్రాజెక్టు భక్తులతో సందడిగా మారాయి. రాత్రి టూరిజం గైడ్ ఎద్దుల మనోహర్ తిమ్మమాంబ, బాలవీరయ్యల జీవిత చరిత్రను బుర్రకథ రూపంలో ప్రదర్శించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఆర్డీఓ..

మహాశివరాత్రి సందర్భంగా తిమ్మమ్మమర్రిమానులో నిర్వహించిన జాగరణ మహోత్సవాల్లో కదిరి ఆర్డీఓ వీవీఎస్ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవేంద్రనాయక్, సర్పంచ్ విష్ణుమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటనారాయణ, నారాయణస్వామి, శ్రీనివాసులు, మనోహర్, లేపాక్షి పాల్గొన్నారు.

మైకుతో పంటకు రక్షణ!

గుడిబండ: పక్షులు, అడవి పందుల నుంచి పంటలను కాపాడుకోవడానికి రైతులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. గుడిబండ మండలం మోరుబాగల్, జంబులబండ, ఫళారం, మందలపల్లి, పీసీ గిరి తదితర గ్రామాల్లో రైతులు వేరుశనగ, రాగి, మిర్చి, మొక్కజొన్నతో పాటు పలు రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. వీటిని కాపాడుకోవటానికి మనుషులు కేకలు వేస్తున్నట్లు రికార్డు చేసి మైకులను పొలాల్లో ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ఆన్‌చేసి ఉంచుతుండడంతో పక్షులు, జంతువులు పంట పొలాల్లోకి రావడం లేదని రైతులు చెబుతున్నారు.



పంట పొలంలో లౌడ్ స్పీకర్లను అమర్చిన దృశ్యం

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం



ఐక్యత చాటుతున్న పీఎస్‌యూ నాయకులు

ధర్మవరం: విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని పీఎస్‌యూ (ప్రగతిశీల విద్యార్థి సంఘం) జాతీయ కార్యదర్శి మహమ్మద్ షఫీవుల్లా పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో జరుగుతున్న పీఎస్‌యూ రాష్ట్ర మూడో మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై తొమ్మిది నెలలు పూర్తవుతున్నా నేటికీ రాష్ట్రంలో 'తల్లికి వందనం', స్కాలర్‌షిప్, ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. ఆర్ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన రాయలసీమ జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం పీఎస్‌యూ ఏపీ రాష్ట్ర నూతన కమిటీని ఎంపిక చేశారు. పీఎస్‌యూ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా మంజుల నరేంద్ర, కార్యదర్శిగా సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులుగా సురేష్, చంద్ర, సహాయ కార్యదర్శులుగా నరసింహ, అయ్యన్న, కమిటీ సభ్యులుగా నందకిశోర్, గోపి, రాంచరణ్, ప్రసాద్, మురళి, కేశవ, అఖిదానంద్ ఎంపికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతిచెందిన ఆంజనేయులు

చిలమత్తూరు: పెద్దనపల్లి క్రాస్ వద్ద బుధవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పెద్దన్నపల్లికి చెందిన ఆంజనేయులు (19) దుర్మరణం చెందాడు. ఇతడి సోదరుడు చిన్నకు తీవ్ర గాయాలు కావడంతో చిక్కబళ్లాపూర్ ఆస్పత్రికి తరలించారు. మహాశివరాత్రి సందర్భంగా దేవాలయానికి వెళ్లి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. ఎస్ఐ మునీర్ అహమద్ కేసు నమోదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి విఫలయత్నం

నల్లచెరువు: ఉబిచర్లలో ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి దుండగులు విఫలయత్నం చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో ఇటీవలే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇందులో విలువైన కాపర్ వైరు కోసం దుండగులు మంగళవారం రాత్రి చోరీకి ప్రయత్నించారు. అలికిడి వినిపించడంతో స్థానికులు అటువైపు వచ్చి కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. గ్రామస్తుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ షెక్షావలి తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌టీఏ నేత కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

తలుపుల : మండలంలోని ఓదులపల్లికి చెందిన వైఎస్సార్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఇంద్రప్రసాద్(45) గుండె పోటుతో మంగళవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని ఇంద్రప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి భార్య నీలావతి, తల్లిదండ్రులు, కుమారులను పరామర్శించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. చిన్న వయసులోనే ఇంద్ర ప్రసాద్ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బుల్లితెర నటుల సందడి



బుల్లితెర నటులతో సీఐ శేఖర్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాములాయి సమీపంలోని 'బెల్లం ప్రపంచం' దుకాణం వద్ద బుధవారం బుల్లితెర నటులు సందడి చేశారు. జబర్దస్త్ ఆర్టిస్టులు గడ్డం నవీన్, సునామీ సుధాకర్, చిట్టిబాబు, మోహన్ శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షిలో కార్యక్రమానికి వెళ్తూ మార్గమధ్యంలో ఇక్కడ కాసేపు ఆగారు. ఈ సందర్భంగా వారిని అనంతపురం రూరల్ సీఐ శేఖర్, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శంకర్, 'బెల్లం ప్రపంచం' ఎండీ తెరీసా, దుకాణం నిర్వాహకుడు శాంతరాజ్ తదితరులు కలిశారు.

రామ్‌నగర్‌లో ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తాం



భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి, మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: రామ్‌నగర్ ఫ్లై ఓవర్ కింద వైపు అండర్ పాస్‌ను ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. ఎస్‌క్యాప్ నిధులు రూ.34 లక్షలతో నగరంలోని రామ్ నగర్ ఫ్లై ఓవర్ కింద ఏర్పాటు చేస్తున్న గార్డెన్ పనులకు బుధవారం మేయర్ వసీంతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మేయర్ వసీం మాట్లాడుతూ గత నాలుగేళ్లలో రూ.15 కోట్ల ఎస్‌క్యాప్ నిధులతో తాము అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. నగరపాలక సంస్థ చరిత్రలో లేని విధంగా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసి చూపామన్నారు. అంతర్గత రోడ్లు, కాలువలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డి, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటోకు నిప్పు



కనంపల్లి క్రాస్ సమీపంలో మంటల్లో కాలిపోయిన ఆటోను పరిశీలిస్తున్న పోలీసులు

గార్లదిన్నె: మండల పరిధిలోని కనంపల్లి క్రాస్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున 44వ నంబర్ జాతీయ రహదారిపై ఓ ప్రధాన పత్రిక (సాక్షి కాదు) తరలించే ఆటోపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. ఈ ఘటనలో ఆటో కాలిపోయింది. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన వివరాలు.. అనంతపురం పట్టణం రుద్రంపేటకు చెందిన మూర్తి.. ఆటోలో అనంతపురం నుంచి వజ్రకరూరు మండలం వరకూ దినపత్రిక తరలించేవాడు. బుధవారం తెల్లవారుజామున కనంపల్లి క్రాస్ వద్దకు రాగానే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంలో వచ్చి ఆటోను అడ్డుకున్నారు. ఆటోపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. మంటల్లో ఆటో కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా ఘటన స్థలాన్ని పరిశీలించారు. పత్రిక డిస్ట్రిబ్యూటరీ ఇన్‌చార్జ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

పరమేశ్వరా.. పాహిమాం



శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న వినాయకుడు



మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు



శివబాలయోగి ఆశ్రమంలో సహస్ర లింగాలకు పూజలు

- భక్తులతో పోటెత్తిన శైవ క్షేత్రాలు
- కమనీయంగా సాగిన కల్యాణోత్సవాలు

అనంతపురం కల్చరల్: మహా శివరాత్రి పర్వదినం భక్తకోటిలో అనిర్వచనీయమైన ఆధ్యాత్మిక అనుభూతులను నింపింది. పరమేశ్వర పాహిమాం.. అంటూ శివ నామస్మరణతో ఆలయాలు ప్రతిధ్వనించాయి. మహా శివుడు విశేష పూజలందుకున్నాడు. సర్వాంగ శోభితుడైన మహేశ్వరుడు తన ప్రియ దేవేరి పార్వతీమాతతో కలసి నగర పుర వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చాడు. బుధవారం తెల్లవారుజాము నుంచే శివాలయాల్లో స్వామి దర్శనం కోసం బారులు తీరారు. ఏకధార రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రం, చమకం పఠనం, మారేడు బిల్వ దళార్చన, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం వైభవంగా నిర్వహించారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలలో చిన్నారులు శాస్త్రీయ నాట్యాలతో నీరాజనాలర్పించారు. శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరుడిని జడ్జి హరిత దర్శించుకుని తీర్థ ప్రసాదాలందుకున్నారు. జిల్లాలోనే తొలిసారి లక్ష లింగార్చన, 108 మంది దంపతులతో సహస్ర లింగార్చన కార్యక్రమాలను ఆలయ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్ నిర్వహించారు.

- పాతూరు చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలు, కోటి లింగదర్శనం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం నగరోత్సవం నేత్రపర్వంగా సాగింది.
- పాతూరులోని ప్రాచీన విరూపాక్షేశ్వరాలయం, శివకోటి, మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వ రాలయాలలో మహాశివుడు భక్తుల శరణుఘోష నడుమ విశేష పూజలందుకున్నాడు. ఆలయ ఈఓ రమేష్‌బాబు, మాజీ చైర్మన్ సోమర జయ చంద్రనాయుడు పాల్గొన్నారు.
- మారుతీనగర్‌లోని కోదండరామ శివాలయం, అరవింద్‌నగర్‌లోని సర్వేశ్వరాలయం, శారదా నగర్‌లోని శివకోటి ఆలయం, హెచ్చెల్సీ కాలనీలోని ననసకోట ముత్యాలమ్మ ఆలయంలో కార్పొరేటర్ గురుశేఖరబాబు ఆధ్వర్యంలో శివ రాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. అన్నపూర్ణేశ్వరీ మంజునాథ ఆలయం, ఆరో రోడ్డులోని శివాలయం, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలను వైభవంగా నిర్వహించారు.

ప్రతిధ్వనించిన ఓంకార నాదం

ఆత్మకూరు: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండలవ్యాప్తంగా శైవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తగా ఓంకారనాదం ప్రతిధ్వనించింది. పంపనూరులోని మంజునాథ స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ శివుని విగ్రహం వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం శివ లింగం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేశారు. ఇక సనప గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో, ఆత్మకూరులోని శివాలయంలో, భైరవేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోన క్షేత్రంలో ప్రత్యేక పూజలు

చెన్నేకొత్తపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని బుధవారం మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శివనామస్మరణతో శివాలయాలు ప్రతిధ్వనించాయి. చెన్నేకొత్తపల్లి సమీపంలోని కోన క్షేత్రంలో వెలసిన కోన మల్లేశ్వరస్వార స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల దర్శనార్థం స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే చెన్నేకొత్తపల్లిలోని కాశీ విశ్వనాథాలయంలో స్వామి వారికి, కనుముక్కల గ్రామంలోని గుమ్మనాథేశ్వరాలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. కనుముక్కల సమీపంలోని కొండల్లో కొలువైన గుండాల మల్లికార్జున స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోన కణ్వాశ్రమం, చెన్నేకొత్తపల్లిలోని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

రాప్తాడులో...

రాప్తాడు: మహా శివరాత్రి పర్వదిన వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. పండమేర వంక సమీపంలో వెలసిన ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే శివ మాలధారులు స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. జలాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే గౌరి ప్రసన్నేశ్వర ఆలయంలోనూ పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అలాగే అయ్యవారి పల్లి, బుక్కచెర్ల, బండమీదపల్లి, ఎర్రగుంట, గొందిరెడ్డి పల్లి, పుల్లలరేవు, బొమ్మేపర్తి, గొల్లపల్లి, రామినేపల్లి గ్రామాల్లోని శివాలయాలతో పాటు మరూరులోని చిన్న కదిరయ్య స్వామి ఆలయం, హంపాపురంలోని 39 అడుగుల అభయ ఆంజనేయ స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

రామగిరిలో...

రామగిరి: మండల వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీ పల్లి, ననసకోట, మాదాపురం, రామగిరి, కుంటిమద్ది, పోలేపల్లి, గంతిమర్రి పంచాయతీల్లోని శివాలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. పేరూరులోని భోగేశ్వరస్వామి, రామగిరిలోని కాశీవిశ్వనాథస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు పానకాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



రాప్తాడురూరల్: మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని అనంతపురం రూరల్ మండలం పాపంపేట ఆంజనేయస్వామి ఆర్చ్ వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన 'వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర' ఉచిత నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. పాపంపేటలోని బ్రహ్మంగారి గుడి నిర్వాహకులు, గ్రామ పెద్దల సహకారంతో నాటక ప్రదర్శన నిర్వహించారు. బ్రహ్మయ్యగా ఎం.ఓబిలేసు, 1వ సిద్దయ్యగా ఎస్.రాములయ్య, 2వ సిద్దయ్యగా వి.శ్రీరాములు, 3వ, 4వ సిద్దయ్యగా వి.ఆంజనేయులు, కక్కయ్యగా శ్రీరాములు, గోవిందయ్య, పీరూసాబ్‌గా చంద్రమౌళి, కాజీసాబ్‌గా ఎస్.రాములయ్య, వీరదాస్‌గా నాగప్ప, పోతులూరయ్యగా జి.నాగన్న తమ వేషధారణలో అలరించారు. స్టేజ్ మేనేజర్‌గా ఓబిలేసు, ట్రూప్ మేనేజర్‌గా నాగప్ప వ్యవహరించారు. శివరాత్రి కావడంతో చుట్టుపక్కల కాలనీల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి నాటకాన్ని తిలకించారు.



పంపనూరులో మంజునాథునికి హారతి ఇస్తున్న దృశ్యం



పంపనూరులో ఏర్పాటు చేసిన శివుని విగ్రహం



ప్రత్యేక అలంకరణలో కనుముక్కలలోని గుమ్మనాథేశ్వరుడు



సనపలో అలంకరణలో రామలింగేశ్వర స్వామి



శివకోటి ఆలయంలో అలంకరణలో పరమేశ్వరుడు



అలంకరణలో చెన్నేకొత్తపల్లి కాశీవిశ్వనాథుడు



రామగిరి: పూజలందుకుంటున్న కాశీవిశ్వనాథస్వామి



అలంకరణలో ఉమా నీలకంఠేశ్వర స్వామి



ప్రత్యేక అలంకరణలో గౌరీ ప్రసన్నేశ్వర స్వామి



శివలింగాలకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



మొదటి రోడ్డు శివాలయంలో భక్తుల కోలాహలం



టీటీడీ కల్యాణ మండపంలో శివపార్వతుల కల్యాణోత్సవం



మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర, కోదండ రామాలయం వద్ద నృత్యం చేస్తున్న చిన్నారులు



జీఆర్ ఫంక్షన్ హాలులో శివపార్వతుల కల్యాణోత్సవం



ఆత్మకూరులో శివాలయంలో భక్తుల సందడి



స్వామివారి దర్శనానికి వెళ్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో జాగరణ

అనంతపురం కల్చరల్: మహాశివరాత్రి వచ్చిందంటే ఉపవాసానికి, జాగరణకు విశిష్ట స్థానముంటుంది. ఆ నేపథ్యంలోనే హిందూ ధార్మిక ప్రచార మండలి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జాగరణ మహోత్సవం ఆద్యంతం వినూత్నంగా సాగింది. తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మప్రచార పరిషత్ వారి సహకారంతో శ్రీపాద వేణు నేతృత్వంలో రామచంద్రానగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన శివరాత్రి వేడుకలకు దత్త అవతార స్వరూపులైన శ్రీమాణిక్యప్రభు మహారాజ్ ప్రియశిష్యులు రాఘవేంద్ర మాణిక్యప్రభు ముఖ్య అతిథిగా విచ్చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. 50 మంది జంటలకు దత్తపాదుకలను అందించారు. ఆదిశంకరుల కల్యాణ మహోత్సవంతో పాటు మహాగణపతి పూజ సంకల్పం, శ్రీమహాత్రిపుర సుందరి సమేత శ్రీ పరమేశ్వర సహస్రలింగార్చన జరిపించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పది, ఇంటర్ విద్యార్థుల కోసం సరస్వతీ పూజ చేసి వేద ఆశీర్వాదంతో కంకణాలను స్వామిచేతుల మీదుగా అందించారు. రాత్రంతా జాగరణ సాగేలా ప్రముఖ గాయనీగాయకుల సంగీత కచేరీ, శాస్త్రీయ నాట్యాచార్యులు, కళాకారులు కళారూపాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

- మూడో రోడ్డు జీఆర్ ఫంక్షన్ హాలులో శివారాధన సమితి ఆధ్వర్యంలో జాగరణ వేడుకలు వైభవంగా జరిగాయి. ఘంటసాల ఆరాధన సమితి పాలసముద్రం నాగరాజు నేతృత్వంలో భక్తి సంగీత విభావరి వీనులవిందుగా సాగింది. వేదపండితులు బ్రహ్మశ్రీ రామగిరి మఠం చంద్రశేఖరస్వామి విశిష్ట అతిథిగా విచ్చేసి పార్వతీ పరమేశ్వరుల కల్యాణ ఘట్టాన్ని, సామూహిక జలాభిషేకాలను భక్తులతో జరిపించారు. ప్రముఖ రచయిత్రి పూజారి వరలక్ష్మి 'శివుడి అనుగ్రహం' అనే అంశంపై ఉపన్యాసమిచ్చారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులందరికీ నిర్వాహకులు రామప్ప, అనంత పద్మనాభ, కేపీఎస్. చలపతిరెడ్డి తదితరులు పండ్లు, ఫలహారాలు, తీర్థప్రసాదాలనందించారు.

పార్కింగ్ అస్తవ్యస్తం

- సర్వజనాస్పత్రి ఆవరణలోనే వాహనాల పార్కింగ్
- ప్రత్యక్ష నరకం చూస్తున్న రోగులు, ఉద్యోగులు



సర్వజనాస్పత్రి ఆర్థోవార్డు వద్ద ఆపిన ద్విచక్ర వాహనాలు



క్యాజువాలిటీ వద్ద ద్విచక్ర వాహనాల పార్కింగ్

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పార్కింగ్ అస్తవ్యస్తంగా మారింది. ఆస్పత్రి ఆవరణలో వందల సంఖ్యలో వాహనాలు నిలుపుతుండడంతో అంబులెన్స్‌లు, రోగులు, సిబ్బంది వెళ్లేందుకు వీల్లేకుండా పోతోంది. ఓపీ షెడ్డు, క్యాజువాలిటీ వెనుక వైపు, బర్న్స్ వార్డు, ఈఎన్‌టీ వార్డు, చౌడేశ్వరీ దేవాలయం ముందు పెద్ద ఎత్తున వాహనాలను నిలుపుతున్నారు.

అంబులెన్స్‌లకు దారేదీ?

సర్వజనాస్పత్రికి రోజూ ఐదు వేల నుంచి ఆరు వేల మంది రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. దీంతో ఆస్పత్రి ఆవరణలోనే కార్లు, ద్విచక్ర వాహనాలను ఉంచేస్తున్నారు. అత్యవసర విభాగానికి (ఎమర్జెన్సీ వార్డు) అంబులెన్స్‌లు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని సందర్భాల్లో అక్కడ అంబులెన్స్‌లు తిప్పుకోలేక..ఆస్పత్రి చుట్టూ ప్రదక్షిణ చేయించాల్సి వస్తోంది. అత్యవసర రోగులను 'గోల్డెన్ అవర్'లో వార్డుకు చేరిస్తే ప్రాణాలు దక్కే అవకాశం ఉంటుంది. అలాంటిది పార్కింగ్ సమస్యతో సకాలంలో చేర్చడానికి ఇబ్బంది పడుతున్నారు.

'మల్టీ లెవల్' ఎన్నడు?

ఆస్పత్రిలో మల్టీ లెవెల్ పార్కింగ్‌కు మోక్షమెప్పుడో అర్థం కావడం లేదు. ఇటీవల జరిగిన ఆస్పత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్‌డీఎస్) సమావేశంలో పార్కింగ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ చెప్పారు. అయితే నేటికీ అతీగతీ లేదు. అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న కూడా తనిఖీ చేసినా ఇంత వరకు ఎటువంటి చర్యలకూ ముందడుగు పడలేదు.

ఆస్పత్రి బయట ఆక్రమణలు

సర్వజనాస్పత్రి బయట ప్రైవేట్ అంబులెన్స్‌లు, తోపుడు బండ్లు నిలుపుతున్నారు. దీనివల్ల కూడా పార్కింగ్ సమస్య తలెత్తుతోంది. వేల సంఖ్యలో రోగులు, వారి సహాయకులు ఆస్పత్రి బయట అటూ ఇటూ తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్నారు. తోపుడు బండ్లు, ప్రైవేట్ అంబులెన్స్‌లను నెహ్రూ బాలభవన్ వైపు ఉంచి.. ఆస్పత్రి ముందు పార్కింగ్ ఏర్పాటు చేస్తే సగం సమస్య తీరుతుంది.

ఆక్రమణలు తొలగిస్తాం

ఆస్పత్రిలో పార్కింగ్ సమస్య వాస్తవమే. ఇటీవల కలెక్టర్ ఆదేశాల మేరకు ఆస్పత్రిలో పార్కింగ్‌ను పరిశీలించాం. అసిస్టెంట్ కలెక్టర్ తనిఖీలోనూ పార్కింగ్ ఆస్పత్రి బయట ఏర్పాటు చేస్తే పరిష్కారం ఉంటుందని చెప్పారు. ఆ దిశగా చర్యలు చేపడతాం. బయట ఆక్రమణలను తొలగిస్తాం.

– మల్లికార్జున రెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్

సాంకేతికతపై ఆసక్తి పెంచుకోవాలి



శ్రీహరికోట సందర్శనలో ఎస్ఆర్ఐటీ విద్యార్థులు

బుక్కరాయసముద్రం: తిరుపతి జిల్లాలోని శ్రీహరికోట అంతరిక్ష పరిశోధనా కేంద్రాన్ని ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ.. శ్రీహరికోటలో ఉపగ్రహ సాంకేతికత నైపుణ్యం, ఉపగ్రహాల నిర్మాణ శైలి, ప్రయోగాత్మక పరిశీలనపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ వీర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.